క్లుప్తంగా

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

చారకొండ: నూతన తహసీల్దార్‌గా శుక్రవారం ఎం ఉమా బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాగర్‌కర్నూల్ ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా చారకొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధుల నిర్వర్తిస్తున్న అద్దంకి సునీత ఉప్పునుంతల మండలానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



ఊర్కొండ: మండల కేంద్రానికి చెందిన సందీప్‌కుమార్, అన్వర్ పాషా, మాదారం గ్రామానికి చెందిన నేరేడి చెన్నయ్యలు గతంలో ఫోన్లు పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణదేవ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను గుర్తించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేశారు. బాధితులు ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

వీధికుక్కల బెడదను నివారించాలి

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో వీధి కుక్కల బెడద నుంచి గ్రామస్తులను రక్షించాలని శుక్రవారం బీజేపీ నాయకులు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వీధి కుక్కల నుంచి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కంపచెట్లు తొలగింపు

బిజినేపల్లి: మండలంలోని సల్కర్‌పేట గ్రామానికి చెందిన యువత అందరికి ఆదర్శంగా నిలిచారు. సల్కర్‌పేట నుంచి తూడుకూర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామ యువత ముందుకువచ్చి సామాజిక మాధ్యమాల్లో కంపచెట్ల, రోడ్డు మరమ్మతు సహకరించాలని పోస్ట్ చేశారు. ఫోన్ పే ద్వారా అందిన డబ్బులతో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు యంత్రాలతో కంపచెట్లను తొలగించారు. గుంతలను పూడ్చారు. ఈ విషయం మండల వ్యాప్తంగా వైరల్‌గా కావడంతో పలువురు యువతను అభినందించారు.

జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకటరమణ

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభ పక్షాళన కమిటీ కోఆర్డినేటర్‌గా సంబు వెంకటరమణను హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కన్వీనర్ మిడిదొడ్డి శ్యాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటరమణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. బాధ్యతగా పనిచేస్తూ ముందుకు వెళ్తానన్నారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి పాటుపడుతానన్నారు. ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

బోరు మోటర్‌కు మరమ్మతు

చారకొండ: మండల కేంద్రంలో 4వ వార్డులో బోర్ మోటర్ మరమ్మతు, పైప్‌లైన్ ధ్వంసం కారణంగా తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కేశమోని శంకర్ గౌడ్ స్పందించి బోరు మోటారుకు మరమ్మతు చేయించి పైప్ లైన్‌ను సరిచేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు కృతజ్ఞత తెలిపారు.

ఉపాధి హామీ పథకంపై గ్రామసభ



పెద్దకొత్తపల్లి: మారేడుమాన్‌దిన్నెలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఉపాధి హామీ పథకంలో ఖర్చు చేసిన నిధులపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పరశురామ్ గతేడాది చేపట్టిన పనులను, కూలీల వివరాలను తెలిపారు. పనుల్లో అవకతవకల గురించి ఫిర్యాదు చేయాలని ఎస్ఆర్పీ స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల గౌరవమ్మ, బాలస్వామి, మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని బడిగెదిన్నె, నారనాయక్ తండా, ఎర్రన్నబావి తండాలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ నాగరాజు తెలిపారు. ప్లానింగ్‌లో భాగంగా సన్న, చిన్న కారు రైతులు బీడు భూముల అభివృద్ధి పనులపై, పండ్ల తోటలపై గ్రామ సభలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పత్తి రైతులు పరేషాన్

- నల్లబడిన తెల్లబంగారం
- పట్టించుకోని అధికారులు



చంద్రాయన్‌పల్లిలో దెబ్బతిన్న పత్తిపంట

చారకొండ: ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో పలు పంటలు దెబ్బతిన్నాయి. పంటలకు తెగులు సోకి దిగుబడి రాక రైతులు కుదేలవుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. ఎన్నో ఆశలతో పత్తి సాగు చేసిన రైతులను వర్షాలు అతలాకుతలం చేసింది. తెల్లబంగారం దిగుబడి రాక పెట్టుబడి కోల్పోయి నష్టాలో ముంచెత్తింది. మండలంలోపత్తి 16 వేల 808 ఎకరాలు, వరి 1361 ఎకరాలు, జొన్న 28 ఎకరాలు, మొక్కజొన్న 58, కందులు 24 ఎకరాల్లో సాగు చేశారు.

పూత దశలోనూ తెగులు ...

కాత, పూత దశలోనే పంటకు తెగులు సోకడంతో రైతుల ఆశలు నిరాశగా మారాయి. కొన్ని చోట్ల పంటలు చేతికి వచ్చే దశలో కురిసిన వర్షాలతో పంటలు నేలపాలైంది. ఏమాత్రం దిగుబడివచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడికూడా వచ్చేటట్లు లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ.15వేల వరకు వెచ్చించామని పేర్కొన్నారు.

తేమ ఎక్కువై..

వరుసగా ఎడతెరపి లేని వానలతో పత్తికి 20 శాతం తెగులు సోకింది. ఆకులు ఎర్రగామారి కాత, పూతదెబ్బతింది. దీంతో దిగుబడిపై ప్రభావం పడింది. తెగులు నివారణకు మందులు పిచికారీ చేసిన ప్రయాజనం లేకుండా పోయింది. కాపు చివరిదశలో భారీవర్షాలు రావడంతో పంట నీటిపాలయ్యింది. పత్తి కాత పూర్తిగా నల్లబడింది. భూమిలో తేమ అధికమై తెగులు మరింత విస్తరించింది. ఎర్రగుమ్మడి తెగులు సోకడమే కాకుండా, వడ తెగులు సోకి పంట చేనులో మొక్కలు ఎండిపోయ్యాయి. మండల వ్యాప్తంగా 4శాతం మరకు పంటలు దెబ్బతిన్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వర్షాల కారణంగా పంటకు తెగులు సోకింది. ఏమాత్రం దిగుబడి చేతికి రాలేదు. పెట్టుబడి పోయి, అప్పు మిగిలింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



– శ్రీను, రైతు జూపల్లి

తెగులు సోకింది

పత్తి పంటకి తెగులు సోకింది. అధిక వర్షాలతో మరింత పెరిగింది. పంటలకు అవసరమైన స్థాయిలో పోషణ లోపించడం ద్వార అప్పటికే ఆకులు ఎర్రగా మారాయి. రైతులకు ఆయా గ్రామాల్లో ఏఈఓల ద్వారా సలహాలు, సూచనలు చేసినప్పటికి వాటి నివారణ చర్యలు చేపట్టారు. అధిక వర్షపాతంతో త్వరతగతిన తెగులు సోకి పంటలు నష్టపోయారు.

– సురేష్, ఇన్‌చార్జ్ ఏఓ చారకొండ

‘సాక్షి’ పై కుట్రలను ప్రతిఘటిద్దాం



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కల్వకుర్తి రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై చేస్తున్న కుట్రలను ప్రతిఘటిద్దామని కల్వకుర్తి టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు పిలుపునిచ్చారు. సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా, న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను పక్కనపెట్టి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. జేఏసీ నాయకుడు జంగయ్య మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నిర్భయంగా నిజాలను రాస్తున్న సాక్షి పత్రికపై కక్ష గట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐజేయూ మండల శాఖ అధ్యక్షుడు జహీర్, జర్నలిస్టు సంఘం నాయకులు శ్రీధర్, రవి, బాలయ్య, నూకం శీను, చారకొండ శీను, బాలు, శేఖర్, సమద్, సిరాజ్, ఫయాజ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం



జటప్రోల్‌లో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

పెంట్లవెల్లి: పశు సంపదను కాపాడుకుందామని జిల్లా, మండల పశువైద్యాధికారులు జ్ఞానశేకర్, మౌనికలు కోరారు. మండలంలోని జటప్రోల్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వచ్చే నెల 14 తేదీ వరకు టీకాలు వేస్తునట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహ, వెంకటేశ్వర్లు, సూరిబాబు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మండల పశువైద్య అధికారి శివకుమార్ గౌడ్ వేశారు. మొత్తం 115 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో శుక్రవారం పశువులు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సీజనల్‌గా పాడి గేదెలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చెన్నయ్య, రమేష్, ఆసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతిఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన అవసరమని అనస్తీషియా విభాగం హెచ్ఓడీ డా.ధీరజ్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి ఆస్పత్రిలో సీపీఆర్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని ఆపదలో ఉన్నవారిని రక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కరుణ భారతి, అతిధి, సురేష్, గౌతమ్, సాయిచరణ్ పాల్గొన్నారు.

హస్తకళలపై ఆసక్తి పెంచుకోవాలి

బల్మూర్: విద్యార్థులు హస్తకళలపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి విష్ణుమూర్తి కోరారు. మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు హస్తకళల శాఖ ద్వారా నిర్వహించిన క్రాఫ్టు డిమినిస్ట్రేషన్, అవేర్నెస్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. హస్త కళలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం హస్తకళలపై నిర్వహించిన పెయింటింగ్ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాతృభూమి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఫౌండర్ రమాకాంత్, టీజీ హస్తకళల శాఖ కార్యాలయ ఇన్‌చార్జ్ అశోక్, ఉపాధ్యాయులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టు



నాగర్‌కర్నూల్ రూరల్: మెడికల్ కళాశాల భూనిర్వాసితుల పక్షాన హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టు లాంటిదని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రామేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక దేవకి ఫంక్షన్‌హాల్ అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అక్రమాలకు, దోపిడీలకు పాల్పడిందని ఆరోపించారు. రైతువేదిక, చెత్త సేకరణ కేంద్రాలకు, వైకుంఠధామాల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 44 ఎకరాల దళితుల భూములను కిరాతకంగా బలవంతంగా లాక్కుందన్నారు. ప్రస్తుత హైకోర్టు తీర్పు ఊరట కలిగించిందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొనాసి రాంచందర్, కొత్తపల్లి కుమార్, పృథ్వీరాజ్, కల్యాణ్, యోసెఫ్, అంతటి నాగన్న, ధారాసత్యం, శ్రీనివాస్, సీపీఐ నాయకులు శివశంకర్, వావిలాల రాజశేఖర్‌శర్మ, మాల మహానాడు నాయకులు సత్యం, బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

తాడూరు: బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కాశన్న మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నారాయన, వెంకటేష్, నిరం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. హనుమంతు, కేశవులు, గంగాధర్, గోపాల్, గోవింద్, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, తిరుపతయ్య, రాజు, భాష, చంద్రశేఖర్, బాబర్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: బీసీ రిజర్వేషన్లపై గవర్నర్ నిరంకుశ వైఖరికి, సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులపై మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతలనాగరాజు, బీసీ సంఘం నాయకులు రాములు, మల్లేష్, లింగమయ్య, బాలకృష్ణ, శ్రీను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఉప్పునుంతల: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మామిళ్లపల్లి, లక్ష్మాపూర్ పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యా ప్రగతిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన



తిమ్మాజిపేట: సమాచార హక్కు చట్టంపై ఆయా గ్రామాలకు చెందిన చౌకధర దుకణాల యజమానులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు బియ్యం సరఫరాపై పూర్తి సమాచారం తెలిసేలా చౌకాధర దుకాణం విధిగా రాసి పెట్టాలని డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి సూచించారు. డీలర్లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కొల్లాపూర్ రూరల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు మండల విద్యాధికారి ఇమ్మాన్యుయేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎన్మన్‌బెట్లలో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్ మార్పుటకు ఆయా పాఠశాలలో స్పెషల్‌గా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్టిఫిషియల్ పాఠశాలలు మండలంలో ఎన్మన్‌బెట్ల, ఎల్లూరులో ఉన్నాయని వివరించారు. అనంతరం ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి, బడిగేదిన్నే, బడిగేదిన్నే తండాల పాఠశాలలను మండల విద్యాధికారి భాస్కర్ శర్మ ఆకస్మికక తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని బాకారం, సూరాపూర్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు సంబంధించి అన్ని రకాల రికార్డులను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సాక్షి, నెట్‌వర్క్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని ఖండిస్తూ శుక్రకవారం జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, బిజినేపల్లి, లింగాల తిమ్మాజిపేట, అచ్చంపేట, ఊర్కొండలో నిరసన ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. నిందితుడికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కల్వకుర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు సంతానం నిబంధనను తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తిమ్మాజిపేట: విద్యార్థినులు బాగా చదివి పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంఈఓ సత్యనారాయణశెట్టి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం రెండో విడతలో భాగంగా విద్యార్థినులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థినులకు శానిటరీ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి సుజాత, పాఠశాల ఆధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



తిమ్మాజిపేట: స్థానిక సంస్థల ఎన్నికలలో ముగ్గురు పిల్లలు సంతానం ఉన్న వారు పోటీ చేసేందుకు కేబినేట్ నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టెలికాం బోర్డు సభ్యుడు శ్రీనివాస బహదూర్ మాట్లాడుతూ ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయడంతో ఎంతో మందికి మేలు చేకూరనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ అధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, నాయకులు ఉస్మాన్, లక్ష్మీనారాయణ, రవూఫ్, మాధవులు, ముబారక్, నాగసాయిలు, వరుణ్, జంగుడు, మల్లయ్య, రమేష్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా కార్మికులకు విముక్తి

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చొరవతో కృష్ణానదిలో వెట్టి చాకిరి చేస్తున్న ఒడిశా కార్మికులకు శుక్రవారం విముక్తి లభించింది. కొల్లాపూర్ డివిజన్ అమరగిరి గ్రామ పరిధిలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో అక్రమంగా ఒడిశాకు చెందిన కార్మికులతో చేపల వేట చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్నా లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు అమరగిరి అడవిలో 13 మంది కార్మికులు పనిచేస్తునట్లు గుర్తించారు. వేధింపులు ఎక్కువ కావడంతో ఒకరు తప్పించుకొని నల్లమల్ల అడవిలో తిరుగుతుండటంతో స్థానిక పశువుల కాపరి నేషనల్ ఆదివాసి సాలిడారిటీ కౌన్సిల్ సంస్థ వారికి సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని న్యాయవాది వలిగొండ విజయరాజు జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ జడ్జికి చేరవేశారు. జడ్జి ఆదేశాలతో స్థానిక కొల్లాపూర్ పోలీసు అధికారులు కృష్ణానదిలో ఉన్న కార్మికులను శుక్రవారం బయటకు తీసుకొచ్చారు. త్వరలో కార్మికులను సొంత గ్రామాలకు తరలిస్తామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది విజయరాజు, ఎన్ఎఎస్‌సీ సంస్థ ప్రతినిధులు వెంకట్, వంశీ, మహేష్ లు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



అచ్చంపేట రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని సీఎం ప్రవాసీ ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేట్ విద్యార్థులు ప్రొఫెసర్ జలేందర్ రెడ్డి నేతృత్వంలో ప్రవాసీ ప్రజావాణిని సందర్శించారు. సీఎం ప్రవాసీ ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డితో సమావేశమై విదేశాలలో వారి క్యారియర్ (విదేశాలలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు) గురించి చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్న విదేశీ విద్య దీవెన స్కీంని ఉపయోగించుకోవాలని సూచించారు.

వ్యాయామంతో ఆరోగ్యం



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పెద్ద ముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, బ్లడ్ గ్రూప్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు ఒక గంట సేపు తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీరజ్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, సాయి శ్రీ, ల్యాబ్టెక్నీషియన్ కల్యాణ్ కృష్ణారావు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తాడూరు: గ్రామానికి చెందిన రైతు సురేందర్‌కు సంబంధించిన పాడి గేదె నాగుల చెరువు కట్టకు అనుసరించుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. రూ.70వేలు వెచ్చించి ఇటీవల పాడిగేదెను కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో ఉన్న చెంచు గూడెంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ గ్రాంట్ నిధుల నుంచి చెంచులకు నిత్యావసర వస్తువులు, బ్లాంకెట్స్, దుస్తులకు సంబంధించిన 200 కిట్లు పంపిణీ చేశారు. ఒక్కొరికి రూ.2 వేల విలువ చేసే వస్తువులు అందజేశారు. కార్యక్రమం లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, రాధాకృష్ణ, నాగరాజు తాళ్ల అంజయ్య, విశ్వప్రసాద్, నరేందర్, ప్రేమ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

తిమ్మాజిపేట: రాష్ట్ర బంద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కోరారు. అన్నీ పార్టీల నాయకులు సంయమనం పాటించాలన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి: చంద్రబండతండాకు చెందిన శంకర్ నాయక్ గత నెల 4న ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మృతిచెందాడు. మృతుడికి రైతు బీమా పథకంలో భాగంగా మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం మాజీ సర్పంచ్ బాలునాయక్, వెంకటస్వామిలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లోక్యానాయక్, సోమ్‌నాథ్, రామ్‌లాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండా మాజీ సర్పంచ్ పత్యానాయక్, చెర్కూర్ గ్రామానికి చెందిన శ్రీనులు ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి గాయపడ్డారు. వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధితులను పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగులునాయక్, మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడు, మాజీ ఉపసర్పంచ్ నర్సింహ, నాయకులు నిరంజన్, శ్రీను, మైసయ్య, సత్యం, యాదయ్య, కొండల్‌యాదవ్, వెంకటయ్య, ఆనంద్, జంగయ్య, రామచంద్రయ్య, గణేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలి



కల్వకుర్తిలో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఆనంద్ జీ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బీసీల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు పలు పార్టీలు మద్దతు ప్రకటించారు. బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

■ బీసీ జేఏసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు హెచ్ ఆనంద్ జీ ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో లక్ష్మణాచారి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

■ కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. అన్ని వ్యాపార వాణిజ్య సముదాయలతో పాటు పాఠశాలలు, విద్యా సంస్థలతో పాటు అన్ని మూసివేసి బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు.

■ చారకొండ మండల కేంద్రంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలన్నారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలని కోరారు.

■ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను తెలకపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ సంఘం నాయకులు విడుదల చేశారు. పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

■ రాష్ట్ర బీసీల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు.